సున్నితపు త్రాసు

(కవితలు)

డా॥ సూరం శ్రీనివాసులు

సున్నితపు త్రాసు

(కవితలు)



డా॥ సూరం శ్రీనివాసులు

సున్నితపు త్రాసు

డా॥ సూరం శ్రీనివాసులు
ప్రిన్సిపాల్
శ్రీ గోరంట్ల వెంకన్న ఓరియంటల్ కాలేజి
తిమ్మసముద్రం
ప్రకాశంజిల్లా - 523 185.

ప్రథమ ముద్రణ: జనవరి 2002

వెల : 20/-

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
ఆర్థిక సహాయంతో ముద్రితం

ప్రతులకు:

1. శ్రీమతి సూరం సులోచన
3-107-1
I.L.T.D. కాలనీ ఎక్స్‌టెన్షన్
చీరాల
ప్రకాశంజిల్లా - 523 157

2. డా॥ టి.ఆర్.కె. మూర్తి
శివాలయం వెనుక
పోలకంపాడు
తాడేపల్లి పోస్టు
గుంటూరుజిల్లా - 522 501

ఒక్కక్షణం

కవిత్వానికి మూలం స్పందన. కవిత్వానికి ఫలితమూ స్పందనయే. మూలమైన స్పందనకు కారణాలు అనేకం. ఫలించిన స్పందనకు పర్యవసానాలు అనేకం.

ఎన్నిగీతలు వివరించినా, ఎన్ని నీతులు వల్లించినా, ఎన్ని ఉద్వేగాలైనా, ఎంతటి ఉద్యమాలైనా, కళలైనా, కావ్యాలైనా ఈ విశ్వంలో ఇంత ఉనికి కోసం, అంతులేని కాలంలో తనదైన క్షణం కోసం, ఆ క్షణం పేరే **జీవితం.**

జీవితం ఇలకన్న బరువైంది, కలకన్న మృదువైనది కూడా. వెలకట్టాలని ప్రయత్నిస్తే దాని విలువ అందనిది.

ఓనమాల నాటి నుండే ఆనవాలు పట్టాలనుకొన్నా చితిపై పేర్చే నాటికి కూడా చివరి అక్షరం పూర్తికానిది జీవితం. దానికి కేంద్ర బిందువు 'తాను' అయినా దాని పరిధి ఈ విశాల విశ్వం. బిందువు స్థిరంగా ఉంటే దాని విలువను గుర్తించగలిగితే తాను ప్రశాంతంగా బ్రతికి పదిమందినీ బ్రతికించే ప్రయత్నం చేయవచ్చు.

ఆ క్రమంలోనే నాటి నుండి నేటి దాకా అనంత సాహిత్యం వెలువడింది. అయితే ఏ కవి దారి ఆ కవిది. ఏ కవి తీరు ఆకవిది. అందరి గమ్యం మాత్రం ఒక్కటే. కాకపోతే కొందరు మజిలీలే గమ్యమనుకొంటే కొందరు గమ్యాన్ని కూడా మజిలీ గానే భావిస్తారు. ఇంకా ఇంకా ముందుకు పోతుంటారు.

ఆ మార్గంలో నడుస్తూ వెలువరిస్తున్న కవితాసంకలనం 'సున్నితపుత్రాసు' తూకానికి ఉపయోగపడితే వాడుకోండి.

ఈ కవితా సంకలనాన్ని ముద్రించటానికి ఆర్థికంగా సహకరించిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి, ముద్రణలో సహకరించిన ఆత్మీయులు డా॥ తిప్పాభట్ల రామకృష్ణ మూర్తి గారికి ఈ సంకలనంలోని కొన్ని కవితలను గతంలో తమ పత్రికలలో ప్రచురించిన వివిధ పత్రికాధిపతులకు, ఆరోగ్యమంతగా సహకరించకపోయినా శ్రమకోర్చి ముద్రణదశలోనే కవితలను చదివి అభిప్రాయాన్ని ప్రకటించిన శ్రీ కె.శివారెడ్డిగారికి కృతజ్ఞతలు

సూరం శ్రీనివాసులు

శ్రీ కె. శివారెడ్డి

స్పందన

"What poets leave behind has always something in it hurt by time, sins, exile.

'Vladimir Holan'

కవిత్వానికి వయోభేదం లేదు. ఎవరు ఎప్పుడయినా ఏ వయసులోనయినా రాయటం ఆరంభిచవచ్చు. అభివ్యక్తిని అరికట్టడం మంచిదికాదు. ఎలావస్తే అలా రానీయండి. బయటికి రావటమే ముఖ్యం. రకరకాల పేర్లకిందవచ్చిందాన్ని తృణీకరించడం ఫాసిజం. నేనీ పుస్తకానికి నాలుగుముక్కలు రాద్దామని కూర్చున్నప్పుడు, అలా రోడ్డు మీద ఒకతను సితార అద్భుతంగా వాయించుకుంటూ వెడుతున్నాడు. అది గోడలు దాటి, తలుపులు, కిటికీలు దాటి నాలోకి పాములా, బహుసుందరమైన దేవతా సర్పంలా చొరబడుతుంది. అలానే ఆగిపోయా; అది దూరమయ్యిం దాకా అలానే కూర్చున్నా; తర్వాత కూడా దాని తరంగాలు, ప్రతిధ్వనులు చెవుల్లో మిగిలిపోయాయి. నిజానికతను సంగీతకారుడు. కాదు; కానీ ఒకే ఒక్క తీగ వాయిద్యం, అతను తయారు చేసిందే, దాన్నమ్ముకుని జీవించటానికి అలా బజార్లో వాయించుకుంటూ, సంగీతాన్ని - వాడి జీవనవేదనని వెదజల్లుకుంటూ వెళ్తున్నాడు. అది నన్ను నిలేసింది. ఏవేవో ప్రశ్నలూ అడిగింది. నాకు తెలియకుండానే చాలా సమాధానాలు చెప్పి వెళ్ళిపోయింది. వెళ్ళిపోయిందా; లోన నిలబడిపోయిందా?

కాలం, పాపం, జీవన బహిష్కరణ గాయపరిచేదేదో అది నాముందు వెదజల్లిపోయింది. గాయపడ్డ తర్వాత పదమో పాటో, మరేదో దాని రూపాన్ని అది వెతుక్కుంటూ బయటికి వస్తుంది. తర్వాత దాన్ని మనం సూత్రీకరిస్తాం. ఫలానా, ఫలానా అని నిర్ధారిస్తాం. ఆ ఏకతార సంగీతకారుణ్ణి ఏది గాయపరిచిందో అది అతని సంగీతం ద్వారా నన్ను గాయపరిచింది. బహుశ కవిత్వమూ అంతే.

"ఇక్కడ .... రాగం వినిపిస్తోందంటే
అక్కడ .... ఏ తీగో నిలువెల్లా కంపించిందని అర్థం
ఇక్కడ .... మెరుపు మైమరపు కలిగిస్తుంటే
అక్కడ .... జనజీవనం సంఘర్షణ పడిందని అర్థం
ఇక్కడ .... అఖండజ్యోతులు ఆవిర్భవించాయంటే
అక్కడ .... ఏ స్నేహమో ఆత్మార్పణ చేసిందని అర్థం"

కవి సూరం శ్రీనివాసులుగారు సరిగ్గానే అందుకున్నారు. మనుషుల్లో వచ్చిన మార్పుల్నీ, సమాజంలో వచ్చిన మార్పుల్నీ కాలానుగుణంగా - ఆదిమసమాజం నుండి ఈ నాటి గ్లోబలీకరణ సమాజం వరకూ —

"అప్పటి దాకా మనిషికి దాచుకోవటమంటే తెలియదు
ఆది తెలిసిన తర్వాత కానీ దోచుకోవటం మొదలవలేదు"
"ఈనాటి రెండు కాళ్ళ జంతువుకు క్రౌర్యమే కాని కారుణ్యం తెలియదు"

అని కొంచెం కటువుగానే పలికారు. బహశా వాస్తవం కూడా.

"ఎప్పుడో కన్నకలలు ఇంకా ఫలించనేలేదు
ఎప్పుడో విరిసిన పువ్వు ఇంకా పరిమళించనేలేదు
ఎప్పుడో పుట్టిన మనిషి ఇంకా నిలువెత్తయినా ఎదగలేదు"

అని అనటంలో మనిషి ఆత్మసంస్కారానికి ప్రాధాన్యత యివ్వటం కన్పడుతుంది. ఆశించిన అభివృద్ధి జరగలే దనేది ధ్వని.

సమాజానికీ, మనిషికీ ఉన్న ఘర్షణ, వైరుధ్యాల్ని, పరిష్కరించే క్రమంలో - అభివృద్ధి - వ్యక్తిగతం కావచ్చు సామాజికం కావచ్చు - వ్యక్తిగతం కాని అభివృద్ధి సామాజికమై ఫలించదని శ్రీనివాసులు నమ్ముతున్నట్టు అతని కవిత్వం చెబుతుంది.

"కొండ ఆకాశమంత ఎత్తు ఎదిగినా ఏంలాభం దానికి పిడికెడు గుండెను కూడా ఆద్దండి" అని అంటున్నాడంటే - హృదయగత సంస్కారం ప్రధానమని నొక్కి చెప్పడమే.

"బ్రతకటానికి కారుణ్యం మూలం"

The Quality of Mercy గురించి పలుకుతున్నారు.

బహుశ జీవనానుభవం నుంచి వారు గ్రహించిన సారాన్ని చెబుతున్నట్టు కనబడుతుంది.

"జీవిత వృత్తంలో కేంద్రబిందువును గమనించకముందే పరిధి పైపు పరుగులు తీయా లనుకోకు"

ఇలా Parables గా చాలా వాక్యాలు కనబడతాయి. తన జీవితం నుంచీ, తన వృత్తినుంచీ తన మనసికప్రవృత్తినుంచీ తను కొన్ని విషయాలు గ్రహించారు, అనుభవంలోకి తెచ్చుకున్నారు. బహుశ ఆచరణలో చవిచూసివుంటారు. అక్కడ్నుంచి ఒక సూత్రీకరణ తీసుకోవటం ఈ కవిత్వంలో కనబడుతుంది. ఈ పద్ధతి తప్పనిగాదు. కానీ నీతివాక్యాల్లో కవిత్వం మిగిలిపోయే ప్రమాదం ఎదురవుతుంది.

ప్రదర్శితం కాకుండా కవిత మొత్తం ఒక దృశ్యాన్నో సందర్భాన్నో, ఒక సంఘటనలో మన ముందుంచితే -

కవిత మొత్తం ఒక Image గా రూపొందితే అదే ధ్వనిపూర్వకంగా సారాన్ని అందిస్తుంది.
తన్ను తాను సంస్కరించుకుంటానికే, ఆత్మపరీక్షచేసుకుంటానికే అన్నట్టు కొన్ని కవితలు-
అయితే పాఠకుడు కూడా తనలోనే తనతోనే వున్నాడన్న స్పృహ కూడా వుంది
'వాతావరణ సూచన' లాంటి వ్యంగ్య కవితలు ఉన్నాయి

"రాష్ట్రంలో కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు అత్యధికంగా నమోదయ్యాయి.
మధ్యలోనే జండా పీకేసిన వివరాలు ఇంకా అందాల్సి వుంది"

అలాగే — 'సమాధులను తట్టి లేపండి' కవితలో "గుడి చుట్టూ ప్రదక్షిణాలు చేసి రాతిలో దేవుని చూడగలమనిషి మనిషిలో మనిషిని చూడటం ఎప్పుడో మరిచిపోయాడు" అంటారు

'నూరేళ్ళూ పండుగే' అనే కవితలో

"ఊహలకు ఉపిర్లున్నంతకాలం చైతన్యం చెలరేగుతూనే వుంటుంది.

భావాలు బతికున్నంతకాలం సామనస్యం వెల్లివిరుస్తూనే వుంటుంది"

ఇలా సూక్తులుగా చాలా కవితలు రూపుదిద్దుకున్నాయి. ఒక సందేశం ఇవ్వాలనే తలపు కలిగి బలంగా వుంటే, యిలాంటి సూక్తి వాక్యాలు వాటంతటవే వస్తాయి.

"కాలాన్నీ దూరాన్నీ కూడా రూకలతో కొలిచే కాలమిది
మనస్సులనూ, మమతలనూ సైతం కరెన్సీ మడతల్లో వెదికే రోజులివి"

"నీకు నువ్వే దిక్సూచివై నిన్ను నువ్వే నడిపించుకోవాలనీ
నీకు నువ్వే నిట్రాతివై నీ బతుకు గుడిసె నిలుపుకోవాలనీ"

"గింజను నేలలో విత్తినప్పుడు చుక్క నీరూ అందనప్పుడు
మొలకెత్తక పోవటం సహజం మళ్ళీ గింజ నాట ననడం అవివేకం"

ఇలా నడుస్తుంది శ్రీనివాసులుగారి కవిత్వం. నిజానికి శ్రీనివాసులు గురించి నాకేమీ తెలియదు. ఆయన వయసెంతో ఏం చేస్తారో, వారి నేపథ్యమేమిటో, వారి ఆశయమేమిటో అచరణ ఏమిటో - ఏమీ తెలియదు

కానీ ఆయన కవిత్వం ద్వారా ఆయన్నీ తెలుసుకోవచ్చు - ఆయన మానసిక ప్రపంచంలో ఏంజరుగుతుంలో ఊహించవచ్చు. - ఆయన ఆశయాలు, ఆయన జీవితాన్ని గురించి, ప్రపంచాన్ని గురించి ఏమనుకుంటున్నారో తెలుసుకోవచ్చు. కవిత్వం ఒక రకంగా ప్రతికవీ ఆత్మకథే.

అతని ఆంతరంగిక ప్రపంచం మొత్తం మనముందుంది. బయటి ప్రపంచంలో కవి చేసే సంభాషణే సంస్పందనే ఆయన కవిత్వం, బయట ప్రపంచం ఆయన ద్వారా, ఆయన చూపు ద్వారా ఆయన కవిత్వంలో ప్రతిఫలిస్తుంది

శ్రీనివాసులు గారికి ఈ ప్రపంచం సక్రమంగా లేదని, సరియైనమార్గాన పోవడం లేదనీ, మనుషులు దిగజారిపోతున్నారనీ ఒక ఆవేదన వుంది. మనుషుల్నీ, ప్రపంచాన్నీ సంస్కరించాలనే బలమైన ఒక కోరిక వుంది. అదంతా ఆయన కవిత్వం.

ఈ కవిత్వం మొత్తం ఫక్తు వచనకవిత్వం గాదు. ఒక రకంగా మాత్రా ఛందస్సులో నడుస్తుంది. కవిగారికి భాష మీద అధికారం వుంది. భాషా, భావదారిద్ర్యాలు లేవు. అయితే శ్రీనివాసులు గారు ఆలోచించాల్సినవి ఒకటి రెండున్నాయి. చుట్టూ వస్తున్న కవిత్వం రూపం ఎలా వుంది... ఏ దశలో వుంది.. ఎలా వ్యక్తీకరింపబడుతోంది.. ఇవి పట్టించుకోకపోతే, మనం out of date అయిపోతాం. శ్రీనివాసులుగారు వీటి మీద ఇక ముందు దృష్టి పెట్టాలని కోరుకుంటువున్నాను. ఏదీ అసాధ్యంకాదు. ఆధునిక కవిత్వం ఆధునిక వ్యక్తీకరణ కోరుకుంటుంది. అది అలవాటు చేసుకోమని, ముందు ముందు శ్రీనివాసులు గారు ఇది పట్టించుకోవాలని కోరుకుంటూ ఆయన్ని కవితా ప్రపంచంలోకి ఆహ్వానిస్తూ,

అభినందిస్తూ
శివారెడ్డి

కవితాగురు పీఠం - మా మాష్టారు

కవిత్వాన్ని తూచే రాళ్ళులేవు నాదగ్గర - అన్నాడు చలం

తూచొద్దు - అనుభవించి పలవరించమన్నాడు శ్రీ శ్రీ

కవిత్వాన్ని అనుభవించి పలవరించడం నేర్పిన మా మాష్టారు - సూరం శ్రీనివాసులు గారు, తల్చుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇది యిప్పటి ముచ్చట కాదు - అప్పుడే ముప్పై ఏళ్ళు గడిచిపోయాయి. నిన్న మొన్నటి జ్ఞాపకంగా అనిపిస్తుంది. పత్తేపురం (చిన్ననింద్రకొలను) ఓరియంటల్ కాలేజీలో చదువుతున్న రోజులు, తెలిసీ తెలియని వయస్సు. అర్ధం అయ్యీకానీ చదువులు. లోకం పోకడ ఏమాత్రం ఎరుగని అజ్ఞానం - అమాయకత్వం - ఏది అనొచ్చు - ఏది అనకూడదు వివేచించుకోలేని ఆవేశం..... అప్పుడు ప్రవేశించారు మా మాష్టారు (యస్.యస్ గారు) మా జీవితాల్లోకి భరతుడి దగ్గర్నుంచీ భామహుడు మమ్మటుడు ఆనందవర్ధనుడు అభినవగుప్తుల మీదుగా అప్పయ్య దీక్షితులు జగన్నాథ పండిత రాయల వరకూ తాను అవుపోసన పట్టిందంతా సంస్కృతంలో సాహిత్య శాస్త్రాన్నంతా మా చిన్ని మెదళ్ళలోకి అద్భుతంగా ఎక్కించారు. భానుడు భవభూతి కాళిదాసు శూద్రకుడు భట్టనారాయణుడు విశాఖదత్తుడు అమరుకుడు దిజ్ఞాగుడు శ్రీహర్షుడు..... శాస్త్రం యిచ్చిన కంటిచూపుతో యిలా లెక్కలేనంత మందిని అర్ధం చేసుకోవడం నేర్పారు. వాళ్ళ నర్ధం చేసుకోడానికి శాస్త్రం తెలీకపోయినా లోటులేదనీ ఆయనే చెప్పారు. చదువులు క్లాస్‌రూంతో ఆగిపోలేదు. తెలుగులో శ్రీశ్రీ కృష్ణశాస్త్రి తిలక్‌లని పరిచయం చేయడంతో పాటు పద్యాలల్లడంలో ఆశుగతినీ, అవధాన కళనీ, సంస్కృతంలో రాత పత్రికలు నడపడాన్నీ..... తానేర్చిన విద్యలన్నీ నేర్పారు. లోకం అంటే అంతేనేమోననే భ్రమనీ కల్పించారు. మధ్య మధ్యలో యీ నేర్పంతా ఎందుకు - అని కొరుక్కొనే పెదవి మీద ఆంక్షలు విధించారు. దేశంలో ఎమర్జెన్సీ కూడా ఆరోజుల్లోనే - మాకు తర్వాత్తెలిసింది. ఎప్పుడో వొకసారి సూర్యుణ్ణి కన్పించకుండా చేసిన దుర్దినం మీద వచన కవిత రాస్తే ఎమర్జెన్సీలో వున్నాం తెల్సా అని ప్రశ్నిస్తే వెర్రిమొగం వేశా.

బయటలోకంలో పడ్డాం జీవితం వొక సముద్రం. లోతుతెలీదు. అప్పుడే గదా దిగింది. కొత్త పరిచయాలు స్నేహాలు, ఆలోచన్లు మారాయి. కొత్త భావజాలం. మా మాష్టారు నేర్పిన పద్యాల్లేవ్ - అవధానాల్లేవ్ - అలంకార శాస్త్రాల్లేవ్. కానీ కలిగించిన సదసద్వివేచన మాత్రం మిగిలింది. అదే దారి చూపించి నడిపించింది. చదివిన చదువుకు నేర్పే చదువుకు పొంతనలేదు. పద్యాన్ని పూర్తిగా వొదిలేసి వచనకవిత్వంలోకి గంతు. అప్పుడే - ఆరోజుల్లోనే మా మాష్టారు సౌమనస్యం (1980) పద్యకావ్యం రాశారు. 'కరుణశ్రీ'తో 'భావనా శ్రీనివాసం' భళా - భళా అనిపించుకొన్నారు. అద్భుతమైన కవిత్వం పద్యం పూలతో మాటాడింది. పూల మదిరేకుల్ని పద్యం విప్పి చూపింది. మానవీయ విలువల్ని ఆఘ్రాణించమంది.

ఆ తర్వాత... జీవన సౌరభాన్ని అందించిందీ ఆయన.

మళ్ళీ యిరవై ఏళ్ళ తర్వాత యిదిగో యిప్పుడు యీ వచనకవితాసంపుటి 'సున్నితపుత్రాసు' కవిత్వాన్ని అనుభవించి పలవరించడం మానలేదుగా - కాస్త పలవరించు అన్న మాష్టారి హుకుం శిరస్సున

దాల్చి –.....

మనసు సున్నితపుత్రాసైనపుడు, ఒక అంతర్యుద్ధంలోంచీ - ఒక అలజడిలోంచీ ఆంతర్యపుటంచుల్లోంచీ అంతర్లయగా పుట్టుకొచ్చిన కవితలివి. మాష్టారెప్పుడూ అంతే... మాటల్లో ప్రవృత్తిలో తూకం సమంగా ఉండాలంటారు. అంతా ఖరాఖండీగా బరాబరీగా వుండాలంటారు. బంగారు వ్యాపారాల షరాబుల 'ధర్మకాటా' కాదిది. బతుకులు చిరిగిన గరీబుల తక్కెడ కాదు. మధ్యతరగతి విలువల మంచీ - చెడ్డలని బేరీజు వేసే సున్నితమైన త్రాసిది.

పదిమంది కోసం పరుగు ప్రారంభించు
నువ్విచ్చిన చెమటబరువు ఎంతుందో గమనించు
...... సమాజంలో నీ వాటా ఎంతుందో స్పష్టపడుతుంది.

మనలోకి మనని చూసుకొని ఆత్మవిమర్శ చేసుకొమ్మని, మనిషికి రిఫ్లెక్షన్ అవసరమనీ చెప్తూ పుస్తకం మొదలై

అడుగు జారినాసరే
నడక మాననివాడే మనిషి
గింజ మొలవకపోయినా
మళ్ళీ విత్తితేనే మనిషి

కొమ్మ విరిగిన చెట్టు
మళ్ళీ రెమ్మ వేయకూరుకోదు

అని మనిషి జీవితంపట్ల ఒక ప్రగాఢమైన ఆశని రేకెత్తించడంతో ముగుస్తుంది. ఈ కవిత్వం పొడవునా కేంద్రం మనిషే. అందుకే మనిషిలోని స్వార్థం పట్ల, క్రౌర్యం పట్ల నిర్ఘృణత్వం పట్ల, కాపట్యం పట్ల, కార్పణ్యం పట్ల విపరీతమైన ద్వేషం -
ఈ నాటి రెండు కాళ్ళ జంతువుకు
క్రౌర్యమే కానీ కారుణ్యం కలగదు

మనిషి జంతుస్థితి నుంచీ ఎదగనితనం మీద జాలి -
ఎప్పుడో పుట్టిన మనిషి
ఇంకా నిలువెత్తయినా ఎదగలేదు
ఎక్కడో రుచి చూసిన రక్తాన్ని
ఇంకా రవంతైనా మరవలేదు

అని రెంటినీ కవిత్వీకరించగలిగారు. విచ్ఛిన్నమౌతున్న మానవ సంబంధాలపట్ల ఆవేదన, ఆత్మగౌరవాల్ని అమ్ముకొంటున్నందుకు ఆక్రోశం, పతనమౌతున్న మానవీయత పట్ల అసహనం - అన్నీ ఒక్క కవితలోనే పొందుపరచగలిగారు.

ఎవ్వరికీ అందకూడదని

ఎంతగానో కుచించుకుపోతున్నాడు

వెదురులా వంగిపోతున్నాడు
జీవితం జారుడుబండను
పాతాళం దాకా పొడిగించుకొని
మనిషి పతనమవుతున్నాడు

మనిషి మరచిపోయాడు
మనిషిని మరచిపోయాడు
కలిసి జీవించే మనిషిలో
మనిషిని చూడడం మరిచిపోయాడు

ప్రతి నిమిషం పరాయీకరణకి గురవుతున్న మనిషి గురించి తపన యీ సంపుటిలో చాలా చోట్ల కనిపిస్తుంది. ఆ పరాయీకరణ వ్యక్తి పరిమితంకాలేదు - జాతినంతటినీ ఆవహించింది. వ్యక్తులేకాదు - దేశం మొత్తం తలలు తాకట్టుపెడుతూ దాన్నే అనివార్య అభివృద్ధిగా బుకాయించే ఒక సంస్కృతిని పాలకవర్గం ప్రచారం చేస్తుంది. ఈ కుట్రని బహిర్గతం చేస్తూ 'ప్రసాదం పంచుతున్నాం - పదిమందీరండి' అని రాసిన కవిత నూతన ఆర్థికసంస్కరణలకీ, ప్రపంచీకరణకీ, దానిపేర్న State Sponsered బానిసత్వానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన అస్త్రం (ఈ సంపుటిలో నాకు బాగా నచ్చిన కవిత యిది). రాజ్యమే పౌరుల్ని అమానవీకరణ వైపు నెడుతోన్నప్పుడు - ఈ చీకటి నుంచి వెలుతురువైపు నడవాలి. 'సూర్యుడి మంటలు ఇల్లంతానిండే రోజు' రావాలి. మనిషిని మనిషిగా బతకనివ్వని మహమ్మారి నుండి బయటపడాలి. మనిషి మనిషిగా మిగలాలి. - మనిషిగా వికసించాలి అన్నదే యీ కవిత్వమథనంలో వొలికే అమృతం.

మనిషి వికసించాలి
మనిషి ఉద్యమించాలి

వికసించిన మనిషే
విశ్వాన్ని శాసించగలడు
ఉద్గమించని సూర్యుడికి
మబ్బుకూడా జరగదు.

మరి 'రేపటి వసంతంకోసం మనిషి పిడికిలి బిగించక తప్పదు'. అన్ని దారులూ ఒకటై నడిపిస్తున్నంత కాలం గమ్యాన్ని మర్చిపోకూడదు.

అయిదు వ్రేళ్ళూ ఒకటై
ఆసరా ఇస్తున్నంతకాలం
పిడికిలినెందుకు సడలించాలి!

తెగించకతప్పదు.

గుండె పిడికెడు - పొట్ట పిడికెడు

వ్రేళ్ళు బిగిస్తే బతుకు పిడికెడు

మనిషి తెగిస్తే లోకం పిడికెడు

అందరికీ సంప్రదాయవాదిగా తెలిసిన మా మాస్టారిలో యింత క్రోధం ఉందని చాలామందికి తెలీదు. ఆయన తెలియనివ్వలేదేమో! ఈ ఆగ్రహం ధర్మాగ్రహం. అది నిప్పులా కాలుతుంది — 'మంటల వెలుగై రాదారుల్లో రాత్రి పహరా కాస్తుంది.' ఆయన మనసెంత మృదువో మాటంత కరుకు.

గురుపీఠంలో కూర్చున్నప్పుడు మాష్టారు చాలా Strong Discipliner కఠోర అనుశాసకులు (మేం మాకు చాతనైనంత వరకు క్రమశిక్షణతో వున్నట్టే కనిపించినప్పటికీ). ఆ కాఠిన్యమే కవిత్వంలోనూ కనిపిస్తుంది. అందుకే చాలాకవితలు మనిషిని ఆజ్ఞాపిస్తూవుంటాయి. మానవప్రవృత్తిని శాసిస్తూ వుంటాయి. జాతికి దారిని నిర్దేశిస్తూ వుంటాయి. కవిత్వంలో 'టీచరింగ్' యిది అంటాన్నేను. అందుకే అనేకానేకసాధారణీకరణాలు.

నిర్దిష్టత యీనాటి కవిత్వానికి ఊపిరి - నిజమే. కానీ నిర్దిష్టానుభవసారమే బిందువు. బిందువు సింధువైనట్లు సాధారణీకరణమౌతుంది. అయితే అనుభవసాంద్రత మనస్సుకి హత్తుకోవాలి. పాఠకుణ్ణి Emotional గా తాకాలి. అప్పుడు వ్యక్తి సమూహమౌతాడు. వైయక్తిక అనుభవం విశ్వజనీనమౌతుంది. నేను నేనుకాదు - నువ్వు నువ్వుకాదు - మనం అవుతుంది. నిర్దిష్టకాలంలో జరిగిన సంఘటనలు కవిత్వంలో సార్వకాలీనమౌతాయి. - సందర్భాలు ఎంత ప్రాదేశికాలో అంత సార్వత్రికాలూ అవుతాయి. ఇంతా చేసి మనిషి అంతర్ బహిర్లోకాల్లో జరిగే స్పందన - సంఘర్షణలే కదా కవిత్వం. మా మాష్టారి మదిలో స్పందన మాత్రం జీవితాన్ని ప్రేమించమనే - మనిషిని ప్రేమించమనే. అయితే యీ స్పందనల్ని శాసించే శక్తులేవో గ్రహిస్తేనే బిగించిన పిడికిలికి ఒకలక్ష్యం ఉంటుంది - ప్రయోజనం ఉంటుంది.

మనిషిని గ్రహించు

మనిషిగానే పరిగ్రహించు

అని ప్రబోధించే మాష్టారి కవితలు చదివాకా ఆయనే నేర్పిన 'రసోవైసః' మాట గుర్తొస్తుంది. ఇంతకీ 'సః' అంటే మనిషే. అది మనిషికి సర్వనామమే గానీ - దాని నామవాచకం మా మాష్టారు - **సూరం శ్రీనివాసులు గారు**

హైదరాబాదు అంతేవాసి

12-1-2002 **ఎ.కె.ప్రభాకర్**

విషయ సూచిక

1	సున్నితపుత్రాసు	1	20	మేలుకొలుపు	29
2	రాదారి పహారా	2	21	లే.....!	30
3	అంతర్యుద్ధం	4	22	మనిషి వికసించాలి.	32
4	అంతరాల అలజడిలో	5	23	వాతావరణ సూచన	33
5	అంతర్లయ	7	24	సమాధులను తట్టిలేపండి	35
6	ఆంతర్యపుటంచుల్లో	8	25	నూరేళ్ళూ పండగే	37
7	ఆకలి ముసుగులో	10	26	హృదయరసాలం	39
8	హిమగిరి ఒరిగితే	12	27	చైతన్యం అనంతం	40
9	ఎదిగీ ఎదగని మనిషి	13	28	ఈ లోకమింతే	41
10	కాగితం పువ్వు	15	29	పునాది	42
11	ఒక గమనిక	16	30	మరో ప్రపంచం	43
12	కాలంతో కయ్యం	17	31	మాయావాదం	45
13	గణిత గమనం	18	32	రేపటి వసంతం కోసం	47
14	చరద్రాత్రులు	19	33	నడవడి పదునెక్కాలి	49
15	చీకట్లో చిరువెన్నెల	21	34	పచ్చనోటు	50
16	జీవితాన్ని ప్రేమించు	22	35	కాలం ఏదయితేనేం	52
17	తమోదీపం	24	36	నీకు నువ్వే దిక్సూచి	54
18	పిచ్చిమొక్క	25	37	నీడ చాటు వెలుగు	56
19	ప్రసాదం పంచుతున్నాం – పదిమందీ రండి	27	38	క్లైబ్యం మాస్మగమః	57
			39	కర్మసూక్ష్మం	59

సున్నితపు త్రాసు

ఆవేశం అవధులు మించినపుడు
ఆలోచన అంతస్తులు దాటినపుడు
నీ పెదవి నువ్వే కొరుక్కొని
ఆ నెత్తురు పరీక్ష చేయించుకో
అసలు నీ తత్త్వమేమిటో తెలుస్తుంది
దానిలో సత్యమెంతో బయటపడుతుంది.

ఆశ తీగలేకుండానే మొగ్గ తొడిగితే
తపన మంటలేకుండానే సెగలు క్రక్కితే
పదిమంది కోసం పరుగు ప్రారంభించు
నువ్వోడ్చిన చెమటబరువు ఎంతుందో గమనించు
అసలు నీ ఆశ ఎటువంటిదో తెలుస్తుంది
సమాజంలో నీ వాటా ఎంతుందో స్పష్టపడుతుంది.

జీవితం చరమసంధ్యవైపు మళ్ళినపుడు
మనస్సు సున్నితపు త్రాసులా మారినపుడు
గతంలోని డైరీలను పరిశీలించుకో
ఎన్ని పుటలు గర్వంగా వ్రాసుకున్నావో చూసుకో
అసలు నువ్వెన్ని రోజులు బ్రతికావో తెలుస్తుంది
ఇంకా ఎందుకు బ్రతకాలో మనస్సుకు వస్తుంది.

రాదారి పహరా

ఆ గవాక్షం గుండా
నీ గుండెలను తాకి
అడవికాచిన వెన్నెల
అలా నిర్లిప్తంగా పోతుంటే
వెంటాడి పట్టుకొనే
ఝంఝూటం నీ కెందుకు?

గుండెను తాకానన్న అహమే తప్పు
గుండె చప్పుళ్ళు వినగలిగితేగా
వెన్నెలకు తన విలువ తెలిసేది
గుండెలోతుల్లోని ఉనికి గుర్తుకొచ్చేది

ఆపాటి వివేకమే దానికుంటే
ప్రతి రేయి పున్నమి రేయి కాకపోయేదా!
నిండుచందమామ
నిత్యమూ కనిపించకపోయేదా!
ఆ జ్ఞానం లేకపోబట్టే గదా
అనుక్షణమూ హెచ్చు తగ్గులై
పెంచుకొన్న కళలనన్నీ
పక్షం రోజుల్లోనే పోగొట్టుకొనేది
గగన మంతా వెతకి చూచినా
ఏ రెటీనాకు అందకుండా పోయేది

మండనీ
వెన్నెలకు తన విలువ తెలిసేలోగా
నీ గుండెను నిలువెల్లా మండనీ
మండే గుండెల్లోనే చైతన్యం
మళ్ళీ మళ్ళీ ప్రజ్వరిల్లేది
అభాగ్యుల కన్నీళ్ళన్నీ
ఆవిరై పోయేది
కమిలే కళ్ళలో నుండే
కఠిన వాస్తవాలు బయటపడేది
ఊహలకూ వాస్తవాలకూ
తారతమ్యాలు విప్పి చెప్పేది

ఇప్పటికి
ఎన్నిగుండెల్ను వెన్నెల్లు పరిహసించాయో
ఎంత వెన్నెల నీరుగారి దిగజారిపోయిందో
విశాలకాలాన్నడిగినా చెప్తుంది
వినీలగగనాన్నడిగినా చెప్తుంది.

ఎన్ని గుండెల మంటలు
అభ్యుదయ గీతికలై నిలవలేదు!
ఎన్ని మంటల వెలుగులు
రాదారుల్లో రాత్రి పహారాకాయడం లేదు!

అంతర్యుద్ధం

నా కోరికలన్నీ నా కళ్ళకే గంతలు కట్టి
నాతోనే దాగుడుమూతలాడే రోజుల్లో
దేన్నో దాన్ని పట్టుకొని
నా గంతలు దాని ఒళ్ళంతా చుట్టి
నేను
ఎక్కడో ఏమూలనో దాక్కుందా మనుకున్నా!
కానీ
నిముషాలు యుగాలు గడచిపోతున్నా
తరాలు అంతరాలు పెరిగిపోతున్నా
నా కళ్ళను గంతలు విడవటం లేదు
నా చూపులు లోకంలో అడుగెట్టడం లేదు
కనీసం
చీకటి వెలుగులు తేడా తెలిసికొందామన్నా
కళ్ళను కలలను కలిపి చూద్దామన్నా
అవకాశం లేదు
అందుకే విసుగెత్తింది
ఇప్పుడు
నాకున్నదల్లా ఒకే ఆలోచన
ఎవరూ నా చేతికి చిక్కకున్నా
బలవంతంగా నా గంతలు
నేనే విప్పుకొని సాగిపోవాలి
చెట్టు చెట్టుకు పోయే విహంగం లాగానో
పుట్ట పుట్టను దాటే కురంగం లాగానో

అంతరాల అలజడిలో

తరతరాలుగా
మా వంశంలో వస్తున్న చీకటి పువ్వులతో
నా ముంగిట్లో
తోరణాలు కట్టి
వెలుగు దొరల నాహ్వానిస్తున్నా
కానీ
పేరులో కూడా
వెలుగు తప్ప మరేమీ సహించలేని దొరలు
నీ గుమ్మంలో అడుగుపెట్టమని
శపథం చేసి మరీ పారిపోతున్నారు.
ఆకాశంలో వెన్నెల అల్లికలు చూచినప్పుడల్లా
వడ్లగింజ ముక్కంతయినా
మా వసారాలో వాలదా అని ఆశపడ్తుంటా
కానీ ఫలితం గగనం
చీకటితోరణాలను
ఇంటి నుండి గెంటివేద్దామంటే
నేనసలే అవిటి వాణ్ని
అవే ఆసరాగా
ఇంతకాలం నడుపుకొస్తున్న వాణ్ని
వెన్నెల వెలుగు ప్రసరింపకపోయినా
పట్టపగలు సూర్యుడి మంటలు మాత్రం
మా వసారా సందుల గుండా
నన్ను పలకరిస్తూనే వుంటాయి

ఏదో ఒకరోజు
సూర్యుడి మంటలు
మా ఇల్లంతా నిండినరోజు

నేను
లేని సత్తువ తెచ్చుకొనైనా లేచి
మంటలన్నీ ప్రోవుచేసి
నా ఇంట్లోనే రాశిపోస్తాను
అయితే
పారిపోయే చీకటిని పరిహసించను
వెలుగుతో స్నేహం కలిపి
రెండింటినీ రెండు కళ్ళలో నిలుపుకుంటా.

అంతర్లయ

ఇక్కడ
రాగం వినిపిస్తోందంటే
అక్కడ
ఏ తీగో నిలువెల్లా కంపించిందని అర్థం

ఇక్కడ
మెరుపు మైమరపు కలిగిస్తుంటే
అక్కడ
ఓ ఘనజీవనం సంఘర్షణ పడిందని అర్థం

ఇక్కడ
అఖండజ్యోతులు ఆవిర్భవించా యంటే
అక్కడ
ఏ స్నేహమో ఆత్మార్పణ చేస్తోందని అర్థం.

నేడు
ఒక కాయ కళ్ళకు కనిపిస్తే
నిన్న
ఒక పువ్వు నేలరాలిందని అర్థం.

ఇక్కడ
ఒక అమృత బిందువు ఎగజిమ్మితే
అక్కడ - ఆ గుండెలో
ఒక సాగర మథనం జరిగిందని అర్థం.

ఆంతర్యపు టంచుల్లో

సాగరతీరంలో కూర్చొని
సంజె వెలుగుతో ముచ్చటలాడుతూ
పిచ్చుక గూళ్ళు కట్టుకొని
మురిసిపోతున్న ఆ రోజుల్లో
ప్రపంచమెంత పెద్దదో అని
అప్పుడప్పుడూ అనిపిస్తుండేది

ఋతుచక్రం గిర్రున తిరిగి
చిన్న తుంపరలకే నా గూళ్ళు కరిగి
సాగరంలో కలిసిపోయిన రోజు
ఇంత పెద్ద ప్రపంచంలో
నా గూడొక్కటే
చిన్నది కాబోలనిపించింది

పిచ్చుక గూళ్ళదశ దాటి
సంఘంతో మచ్చిక చేసి
బ్రతికే వయస్సు వచ్చిన తర్వాత
కళ్ళెదుట కదం త్రొక్కే కడలిలో
చుక్కకూడా పానీయం కాదని తెలిసాక
నింగీ నేలా కలవాలంటే
సముద్రానికటే కానీ
ఇటు కాదని అర్థమైన రోజు

నడక కాలంతో పాటైనా
చూపుమాత్రం ముందుకో వెనక్కో
అని స్పష్టమైన రోజు - ఈ రోజు
నా కనిపిస్తోంది
ఈ ప్రపంచం చాలా చిన్నది
నా తనువులోని మనస్సు కన్నా
నా గుప్పిట్లోని ప్రాణం కన్నా......

ఆకలి ముసుగులో

ఆకులతో మానాన్ని
కేకలతో ప్రాణాన్ని
కాపాడుకొంటూ
నిరంతర సంచారశీలుడై
అనంతకాంతారాల సందిట్లో
నడకే తన నాగరికతగా
అడుగే తన ఆయుధంగా
అలవోకగా బ్రతికేసిన
ఆటవిక మానవుడికి
ఆకలేగానీ ఆశలు లేవు

ఆనాటి తరువు లసలు
ఫ్యాషన్ షోలను పల్లవించలేదు
నిప్పంటే తెలిసికొని
నిత్యాగ్నిహోత్రుడైన నరుడు
ముట్టుకుంటే ముప్పనే
ముందుచూపు కోల్పోయాడు

ఆనాటి మనుషులెవ్వరూ
మంటల్ను గుండెలకెత్తుకోలేదు
ఆనాటి బ్రతుకు లెప్పుడూ
ఆరని చితులుగా అనిపించలేదు

దావాగ్ని మధ్యలో
దహించుకుపోతున్న వనాలు
ముందడుగు స్తంభింపజేస్తూ
ముంచెత్తివేస్తున్న నదాలు

ఏవేవో రంగులు మార్చుకుంటూ
పండినప్పుడే రాలుతున్న ఫలాలు
కాలానికి ఉనికిని కల్గించాయి
కలలకు ఊపిరిని కల్పించాయి

అప్పటిదాకా మనిషికి
దాచుకోవటమంటే తెలియదు
అది తెలిసిన తర్వాత కానీ
దోచుకోవటం మొదలవలేదు
ఆకలి రుచి తెలిసింది
జిహ్వాకు చాపల్యం పెరిగింది
ఆశలకు రూపం వచ్చింది
అంతరంగం కుళ్ళట మారంభమైంది

ఆకలికి అలసత్వం పెరిగి
ఆశలు అఘాయిత్యాన్ని మరిగి
కదిలే ఒక దిష్టిబొమ్మగా
కనలే పాపిష్ఠి జన్మగా
ఎదుగుతున్న మనిషి
ఏం జరిగిందో ఏమో

తనకొక
మనసుందని మరిచిపోయాడు
దానికొక
వరసుందని విస్మరించాడు
ఈనాటి మానవుడికి
ఆశలే కానీ ఆకలి విలువ తెలియదు
ఈనాటి రెండు కాళ్ళ జంతువుకు
క్రౌర్యమే కానీ కారుణ్యం కలగదు.

హిమగిరి ఒరిగితే!

అయ్యో!
నింగిలోని తెల్లజెండా
కొనలు విరుచుకుంటూ
కొండ చివర్లో కూలిపోతోంది
తెల్ల పావురం చితిమంటల్లో దూకి
ఆత్మాహుతి చేసుకోవాలనుకుంటోంది
కన్నతల్లి కన్నీళ్ళను చూడలేక
కాలానలాన్ని కౌగిలించుకోవాలనుకుంటోంది

తూర్పు పడమర లొకేవైపు వ్రాలిపోయి
శిశిరమధుమాసాలొకే తోటలో బందీలయి
మందారవనాంతరాల్లో
మబ్బు తునకలే పూస్తున్నాయి
ఆనంద కోశాంతరాల్లో
అడవి వెన్నెల్లే కాస్తున్నాయి
ఆపండి బాబూ!
మన నెత్తుటిలో ఎన్ని కత్తులు పారుతున్నా
దాని రుధిరాన్ని కోరటం లేదని చెప్పండి
కనీసం కాగితం పడవలో అయినా
శాంతిసాగరంలో విహరిస్తూండమనండి
మనలో మానవత్వం మారాకు తొడిగితే
మళ్ళీ పిలిపించుకుందాం
మరో క్షణం లోనో
మరో యుగంలోనో....

ఎదిగీ ఎదగని మనిషి

ఏనాడో చల్లిన గింజలు
ఇంకా మొలకెత్తనే లేదు
ఎప్పుడో పుట్టిన మనిషి
ఇంకా నిలువెత్తయినా ఎదగలేదు
ఎదిగితే సాక్ష్యం చెప్పాలని
ఎదురు చూస్తూనే ఉంది ప్రకృతి
ఎప్పటికైనా ఎదగకపోడని
తోడై పరుగిడుతోంది కాలం

ఎప్పుడో కన్న కలలు
ఇంకా ఫలించనే లేదు
ఎప్పుడో విరిసిన పువ్వు
ఇంకా పరిమళించనే లేదు

చేయి చేయి కలిపి సాగినా
తప్పటడుగులు తప్పటం లేదు
మబ్బు మబ్బు కలిసికురిసినా
పుడమి పులకరించటం లేదు

ఎప్పుడో మొదలైన ప్రయాణంలో
మొదటి మజిలీ కూడా చేరలేదు
ఎప్పుడో అంటించిన చితి
ఇంకా ఆరిపోవటం లేదు

ఎప్పుడో పుట్టిన మనిషి
ఇంకా నిలువెత్తయినా ఎదగలేదు
ఎక్కడో రుచిచూచిన రక్తాన్ని
ఇంకా రవంతైనా మరవలేదు

అలలపైనే అన్వేషణలయితే
అగాధాలు తీరు
ఆవంతైనా తెలీదు
మరుగుజ్జుగానే బ్రతికేద్దామనుకుంటే
ఎదగటంలోని హోరు
ఎప్పటికీ అర్థం కాదు.

కాగితం పువ్వు

హిమాలయాల కొనలు
ఆరని సిరిమల్లెలుగా
నీ సిగలో నిలిచిన రోజు
నా చూపుల్లోని వేడి
రెప్పదాటి ముందుకురకాలంటే
ఎంతో భయపడిపోయేది
కానీ
అవే రాటుదేలిన కొనలు
చురకత్తుల్లా
నీ కళ్ళలో నిలిచిన నాడు
నవనీతం లాంటి నా మనస్సు
బయట పడాలన్నా బెదిరిపోతోంది
ఏ బండశిలనో తన ప్రతినిధిగా జేసి
తానొక శిల్పంలో ఒదిగిపోతానంటోంది

నేనే ఆ సజీవశిల్పమనీ
నీవే ఆ శిల్పానికి ఊపిరనీ
భ్రమపడిన నాకు
ఇప్పుడిప్పుడే ఆకళింపుకొస్తోంది
నేను శిల్పాన్ని కాను
కేవలమొక జీవచ్ఛవాన్ని
నీవు ఊపిరివి కావు కేవలం
గాలివి నిత్య సంచార శీలవు

ఒక గమనిక

కొండ ఆకాశమంతెత్తు ఎదిగినా ఏం లాభం?
దానికి పిడికెడు గుండెను కూడా అద్దండి
భూమి గోళమంత విస్తరించినా ఏం లాభం?
దానికి వీసమెత్తు నిలకడ నేర్పండి
నిప్పు నివురుమాటున దాక్కున్నా ఏం లాభం?
సర్వభక్షకత్వాన్ని విడిచి శుచిగా బ్రతకమనండి
నీరు ఉప్పెనగా ఉరకలెత్తి ఎగబడితే ఏం లాభం?
ఒక్క కన్నీటి బొట్టు కార్చటం నేర్చుకోమనండి
గాలి ప్రభంజనమై గాడితప్పితే ఏం లాభం?
గరిక పరకలతో కలసి ప్రయాణించ మనండి

పంచభూతాలూ తమమానాన తామున్నాయి
మనకేం కావాలో చెప్పి చేయించుకుందాం రండి
పెదవులన్నీ దేనికదిగా ప్రార్థిస్తే ఏం లాభం?
అన్నీ కలిసి ఒకే విశ్వగీతాన్ని ఆలపించమనండి
బ్రతకటానికి కారుణ్యం మూలం
కలిసి బ్రతకలేక కాళ్ళు నరుక్కుంటే ఏం లాభం.....

కాలంతో కయ్యం

జాతి జీవన తీరంలో
ముత్యాల్లా ప్రకాశింపవలసిన
నా పవిత్ర సంస్కృతి శకలాలను
అజంతా ఎల్లోరా గుహల్లో శిలువ వేశారు
పాలరాళ్ళతో సమాధులు కట్టి
మధ్యలో ప్రదర్శనకు నిలబెట్టారు

ఆగిపోయిన గడియారాన్ని
అందమైన పెట్టెలో పెట్టి
ముళ్ళు చూచుకుంటూనే
మురిసిపోతున్నారు
కళ్ళలో వెలుగవలసిన ప్రతిదీపం
గుండెల్లో రగులవలసిన ప్రతిభావం
ఆ సంస్కృతి మూర్తి అందించిన
అభ్యుదయ కళాస్వరూపం
అయినా
దీపాలు కొడిగట్టిపోతున్నా
భావాలక్కడే అణగారిపోతున్నా
కళాస్వరూపం మాత్రం
కాలంతో పోటీ పడుతోంది
నువ్వు ముందో? నేను ముందో?
తేల్చుకుందాం రమ్మంటోంది

గణితగమనం

జీవితవృత్తంలో
కేంద్రబిందువును గమనించక ముందే
పరిధివైపు పరుగులు తీయాలనుకోకు
వైశాల్యమంతా విహరించాలని కలలు కనకు
రాబోయే ఒత్తిడులలో
ఒడిదుడుకులలో
నిశ్చలంగా నిలువగల
గరిమనాభి నిర్ణయమై వుంటే
నిర్మలంగా నవ్వగల
చైతన్యం సొంతమై వుంటే
ముందుకురుకు

కదిలే ప్రతి ఆకు
మ్రానును కదిలించలేదని
ఎగిరే ప్రతిపక్షి
నింగిని కబళించలేదని
నువ్వర్థం చేసుకొన్ననాడు
ఏ వేదనా నీ హృదయాన్ని
చలింపచేయలేదు
ఏ శోధన నీ కన్నుల్లో
జడివాన కురియనీదు
అయినా ఒక్కటి గుర్తుంచుకో
నీ మనస్సు రాళ్ళను ప్రసవిస్తుంటే
అదొక వజ్రాల ఖని
అడుగుపొరలు బయటపడేదాకా త్రవ్వు
నీ స్వాంతం శూన్యంగా ప్రసరిస్తోందంటే
అది అనంతాకాశం
చుక్కలు కనిపించేదాకా అన్వేషించు....

చరద్రాత్రులు

శరద్రాత్రి చంద్రికాకాసారాలు
భావోద్విగ్నమైన బూజుకణాలై
ప్రాభాతికస్వప్న శిలీంధ్రాలుగా
విహాయసవిశ్వంలో విహరించనిరోజు
నా జీవితంలో లేనేలేదు

ఆ వర్తనశీలమైన కాలానికి
పరివర్తన పరమార్ధమని చెప్పి
మాగన్నుగా నిదురించి
ప్రభాతాన లేచి చూస్తే
రాత్రి గడచిపోయింది
రాత్రి చేసిన ప్రబోధంకూడా
రాకాసిలోయలో జారిపోయింది

ఒక కణమైనా ఎదగగలిగితే
ఒక పగటి బ్రతుకు సార్ధకం
ఒక మనిషైనా నిండుగా నిద్రిస్తేనే
ఒక రాత్రి జీవితం ధన్యం

పగళ్ళు పరుగులెత్తుతూనే వున్నాయి
ప్రపంచపు కాళ్ళను నిలువనీకుండా
రేసుగుర్రాల్లా కదను త్రొక్కిస్తున్నాయి
రాత్రులు రహస్యిస్తూనే వున్నాయి
అంధకారమే తమ ఆవరణమని
సిగ్గు లేకుండా శివాలెత్తుతున్నాయి

ఏ పగటి పూటైనా
ఇంత వెన్నెల
ఏ కనుపాపలోనైనా కదలాడిందా?
ఏ రాత్రి అయినా
ఇంత మానవత్వం
మరునాటికి మొలకగా మారిందా?

పగళ్ళు రహదారులు పరుస్తూనే వున్నాయి
ఉషోదయపు ఉద్వేగం తీరేలోగానే
అస్తాద్రివైపు చూచి ఆవులిస్తున్నాయి
రాత్రులు గ్రుడ్డిదీపాలై రగుల్తూనే వున్నాయి
కన్నుమూసి తెరచేలోగా
కార్పణ్యంతో బుసలు కొడుతున్నాయి

ఏ పగటి పూటైనా
విశ్వమంతా ఏకమై
ఒకే ప్రేమగీతాన్ని ఆలాపించ గలిగిందా?
ఏ రాత్రి అయినా
లోకమంతా ఒక్కటై
కోడికూసేదాకా కూరిమి పంచగలిగిందా?

పగళ్ళు పరిహసిస్తూనే వున్నాయి
రాత్రులు ప్రగల్భిస్తూనే వున్నాయి
శరద్రాత్రులైనా చరద్రాత్రులవుతున్నాయి
జ్వలించే గుండె ముక్కగా
జాబిలికి నగిషీలు అద్దుతున్నాయి.

చీకట్లో చిరు వెన్నెల

ఆకాశంలో పండువెన్నెల
అలలసొగసుతో విరిసినప్పుడల్లా
నువ్వు నిశ్చలంగా గగనంవైపు
నవ్వుతూ చూస్తున్నా వనిపిస్తుంది

చివురుటాకులు చిత్రంగా
నిలువెల్లా పులకరించి నప్పుడల్లా
ఈ వనీతలాన్నో - ఏ
అవనీతలాన్నో - నీ అడుగులు
మృదువుగా స్పృశించాయనిపిస్తుంది

సంజె వెనుక పొరలుపొరలుగా
చీకటి తెరలు కప్పినప్పుడల్లా
నీ కాటుక కళ్ళు నా కోసమే
నీలాలను కురుపిస్తున్నాయనిపిస్తుంది
కానీ
పట్టపగలు సూరీడు
నిప్పులు కక్కినప్పుడల్లా
విడిపోయిన నిన్ను నన్ను చూచి
ఈ లోకమంతా ఏకమై
వికటాట్టహాసం చేసినట్టనిపిస్తుంది.
అందుకే
నా లోకంలో
పగలు పాదం పెట్టే అవకాశంలేదు
ప్రశాంతమైన రేయి
పారిపోయినా ఊరుకొనేదీ లేదు.

జీవితాన్ని ప్రేమించు

మబ్బుకురిసి మమతలు పండించుతుంది
మమత వుంటేనే జీవితం
గాలివీచి కదలికలు కల్పిస్తుంది
కదలిక వుంటేనే జీవితం

బ్రతుకు బరువైతే బండగా మారుతుంది
బండకుండదు చైతన్యం
మనస్సు మైలవడితే ప్రపంచాన్ని ద్వేషిస్తుంది
ద్వేషంతో విరియదు నందనం
ఋతువులన్నీ ఒక్కటై కాలాన్ని నడిపిస్తే
కాలం హసిస్తుంది, కాలం ద్రవిస్తుంది
కాలం కన్నీళ్ళుజేస్తుంది
కాలం కరుణరసమై పారుతుంది

కాలం నేర్పే నడకలలో
తప్పటడుగులు సహజం
నడవాలన్నా భయపడుతుంటే
అవిటితనమే జీవితం

జీవితం హసించాలి
జీవితం ద్రవించాలి
శిథిలాలయాల మధ్యనైనా శిల్పం కావాలి
అగాధాల అంచుల్లో ఐనా నిశ్చలంగా నిలవాలి

జీవితాన్ని ప్రేమించు
ప్రేమను ప్రేమించు
ప్రేమించటాన్ని ప్రేమించు
ప్రేమలన్నీ విఫలమైనా
జీవితమొక ఖజానా
ఋతువులన్నీ వికలమైనా
కాలం ఒక కార్ఖానా....

తమోదీపం

నిన్ను నమ్మి
కన్నీళ్లను కానుకపెట్టి
మన్నించని మనస్సులో
మందారాలు పూయించి
నీ పాదాల పారాణి సాక్షిగా
నిలువెల్లా పులకించి పోతూ
నెవేదించుకొన్న నిముషంలో
నీ చూపుల శూలాలు
నా గుండెలలో దూసుకు పోయాయి
నీ మాటల ఈటెలు
నా హృదయాన్ని సూటిగా తాకాయి
నీ హృదయానికి
కరగటమంటే తెలియక
కదలటమంటే కుదరక
దొర్లిపడే పాషాణంలా
నా బ్రతుకు మీదికి జారింది
ఇప్పుడు
నాగతమంతా రక్తసిక్తం
నా మనస్సంతా అనురాగదిగ్ధం
నా తలపుల్లోని భావాలు
చీకట్లకు వ్రాసుకున్న వ్యాఖ్యానాలు

పిచ్చి మొక్క

నువ్వు ఒంటరివే

ఎన్ని ఉషస్సులు
నీ కనురెప్పలను
ప్రేమగా పలకరించినా
ఎన్ని వెన్నెల రాత్రులు
నీ గుండెలకు వెల్లవేసినా
నువ్వు ఒంటరివే

మానవమానస పాషాణాలన్నీ
సజీవశిల్పాలుగా రూపుదిద్దుకొనే దాకా
అమృత భాండాన్నైనా
అందరికి పంచగల అతిథి
కాలాశ్వపు కళ్ళాలను చేజిక్కించుకొనేదాకా
నువ్వు ఒంటరివే

ప్రత్యూష పవనాంకురాలలో
సత్యలతాంతాలు నృత్యమాడేదాకా
హిమవద్గిరి తుషార శకలాలు
నిప్పులై నీ నెత్తిన వర్షించే దాకా
నేటి అవసరం
రేపటి ఆశ మీద
తిరుగుబాటు ప్రకటించే దాకా
నువ్వు ఒంటరివే

నీ గుండెల మీదుగా నడిచిన సమాజం
ఆ పగుళ్ళను ఇంత ఆర్ద్రతతో అతికించదు
నీ శరీరం కలిసిపోయిన ఆమట్టిలో
మరో పిచ్చిమొక్క మొలవకపోదు

ప్రసాదం పంచుతున్నాం - పదిమందీ రండి

మొన్నటి చరిత్రలు
నిన్నటి పుస్తకాలై
నేటికీ జి.కె రూపంలో
మెదళ్ళు తొలుస్తూనే వున్నాయ్

సూదిగా వచ్చి
దబ్బనంలా మారిన వైనం
జాతీయపతాక సాక్షిగా
చెప్పుకుంటూనే వున్నాం

స్వాతంత్ర్య సమరయోధుల
ఉచిత ప్రయాణాలు
ఇంకా సాగుతూనే వున్నాయ్
దేశభక్తికి వెలగట్టి
సర్కారు ఇచ్చిన భూముల్లో
ఇంకా నాట్లు పడ్డాయో లేదో!
అయినా సరే
మళ్ళీ అటువేపే పరుగు
అజ్ఞానంతో నాడు
విజ్ఞానం ఎక్కువై
కంప్యూటర్ సాక్షిగా నేడు
ఆత్మహత్యలు అలవాటైన జాతికి
ఆత్మరక్షణ పోరాటం అర్థమై చావదు

అందరూ తలా కొంచెం
నంజుకునే క్రమంలో
ఆత్మార్పణల ముహూర్తం
ఆసన్నమైనా తెలియదు
తలలన్నీ తాకట్టు పెట్టి
ఋణాలతో దూసుకుపోతున్నాం
చేయి విదల్చని వాడిదే పాపం
మనం మాత్రం చేయిచాపి సిద్ధం

తుపాకి గొట్టం నుండి
సౌరాజ్యమొచ్చేలోగానే
ఫ్యాక్టరీల పొగ గొట్టాలనుండి
స్వాతంత్ర్యం చేజారిపోతోంది

చదివింపుల కాశపడి
సత్యనారాయణ వ్రతాలు చేస్తున్నాం
ప్రసాదాన్ని మాత్రం
ప్రపంచ దేశాలకు పంచిపెడుతున్నాం.

మేలుకొలుపు

సుప్రభాత వీచికలకు
సూర్యోదయానికి ముందే
భరతవాక్యం పలకండి
నిద్ర లేచి కదలకుండానే
కళ్ళు నులుముకొనే పసివాళ్ళను
మళ్ళీ నిద్రలోకి రానివ్వండి.
అంతశ్చేతనలోని ఆర్తగీతాలవాడితో
మండేగుండెల్లోని మౌనమృదంగ ధ్వనులతో
తమ సుప్రభాత గీతాలను
తామే పాడుకుంటూ
తమ సూర్యోదయ సన్నాహాలను
తామే చేసుకుంటూ
లేవనివ్వండి
జాతిజీవనగీతాలు పాడుకుంటూ
జాగృతులను కానివ్వండి
నేలమీద వ్రేళ్ళు నిలవని వాళ్ళను
కాలం మీద కాళ్ళు నిలవని వాళ్ళను
దివారాత్రుల సంధి వేళల్లో
దిక్కూ మొక్కూ లేక దిగాలు పడేవాళ్ళను
వేదనా జ్వాలల హృదయాంతరాళాల్లో
కమిలి నుసై మసిగా మారిపోనీండి
చెలరేగే గాలితుఫానుల వడిలో
పరమాణువులై ఎగిరి
ప్రపంచానికి సందేశ మివ్వమనండి
నిరాశోపహతులకు నిష్కృతి లేదనీ
మత్తుగా జోగే జనాలకు
ప్రగతి పథంలో చోటే లేదనీ

లే....!

ఈ జీవితవిశాలవిశ్వంలో
ఎండ కన్నెరుగకుండా ఎవ్వరూ చావలేదు
గుండె బరువెక్కకుండా ఎవ్వరూ బ్రతకలేదు
పాలరాతి కట్టడాలకైనా
నీడలు మాత్రం నల్లగానే కనిపిస్తాయి
కోడెత్రాచులవంటి బ్రతుకులైనా
కుబుసాల నెప్పటి కప్పుడు విడుస్తాయి

నిర్ద్వంద్వంగా నిర్ణయించలేని
ద్వంద్వభావాల మధ్యలో
ఏ భావానికా భావానికే
ఒక సమర్థన కనిపిస్తుంది
ఏ వయస్సున కావయస్సులో
ఒక సమ్మర్దం రొద చేస్తుంటుంది

అర్ధరాత్రిలోనే కోడికూసినా
అభ్యుదయరోచిస్సుదయిస్తేనే
కళ్ళు నులుముకొని లేస్తుంటాము
సగానికి పైగా బ్రతుకు సాగిపోయినా
ఎందుకో ఇంకా నిద్రిస్తూనే వుంటాము

ఎండమండేటప్పుడు కూడా
వెన్నెల పదాలు పాడాలంటే
గుండె బరువెక్కినా కూడా
తేలికగా ఊపిరి పీల్చాలంటే
కోడికూసినా నిదురించే తత్త్వాన్ని
కొండ గుహల్లో సమాధి చేయాలి
చైతన్య శంఖారావాలతోనే
అభ్యుదయ తేజస్సు కాహ్వానం పలకాలి

మనిషి వికసించాలి

తనలోకి తాను కూరుకుపోయే మనిషిని
దేంతో ముడివేసి పైకిలాగగలం
తమను తామే మరచిన తరంగాలను
ఏం చెప్పి నిలకడగా నిలపగలం

తనను తానే హింసించుకొనే మనిషికి
ఏ బుద్ధుడి ప్రబోధాలు వినిపించగలం
తనలోకి తానే ద్రవించే మనిషిని
ఎంత చేసినా ఘనంగా ఎలా చూడగలం

మనిషి వికసించాలి
మనిషి ఉద్యమించాలి
ఏటిని ఎడారంత విస్తరింపజేయాలి
ఎడారినైనా ఉప్పెనలా ఉరికింపజేయాలి

వికసించిన మనిషే
విశ్వాన్ని శాసించగలడు
ఉద్గమించని సూర్యుడికి
మబ్బు కూడా జంకదు.

వాతావరణ సూచన

ప్రాంతంలో వాతావరణం పొడిగా వుంటుంది
మండే గుండెలు ఎగిసిపడి ఎదిరిస్తే
ఎన్ కౌంటర్‌లో ఎవరయినా మరణిస్తే
నేలంతా నెత్తుటితో తడవుతుంది
అకాలమరణానికి గురైన తుపాకి గుళ్లు
హతుల తనుస్పర్శతో పునీతమవుతాయి

ఆకాశం మేఘావృతమై వుంటుంది
బ్రతుకులన్నీ బరువెక్కుతుంటాయి
రేపటిని గురించిన భయం
నరనరాన జీర్ణించుకొనిపోతుంది
అక్కడక్కడా ఆశలజల్లులు పడవచ్చు
అనుభవానికి రాకుండానే అంతరించి పోవచ్చు

అంతరంగ వాతావరణకేంద్రం
అందించిన సమాచారం ప్రకారం
మనిషి మనిషికీ మధ్య
అగాధాలు అధికమవుతాయి
సుడిగుండాల మధ్యలో
చిక్కుకున్న అభాగ్యులను
అక్కడే సమాధి చేసేందుకు
అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి

రాష్ట్రంలో
కంప్యూటర్ కోచింగ్ సెంటర్లు
అత్యధికంగా నమోదయ్యాయి
మధ్యలోనే
జెండా పీకేసిన వివరాలు
ఇంకా అందవలసి వుంది

రాగల సంవత్సర కాలంలో
సంస్కరణల జోరు
కొనసాగుతూనే వుంటుంది
సహనంలేక చచ్చిపోతే
గణాంక వివరాల సేకరణ
వచ్చే దశాబ్దానికి వాయిదా పడుతుంది

హిమాలయాల నుండి
హిందూ మహాసముద్రం దాకా
దేశమంతా వేడిగా ఉంటుంది
ఎవడి గొడుగు వాడే పట్టుకొని
ఎదురెండలో నడవాలండి
ఎవడి ఊపిరి వాడే తీసుకొని
ఏత్యాగానికైనా సిద్ధపడాలండి

వేసిన ఓట్లు
ఊరికే పోతాయా
వెర్రిమొగాలతో చూడకండి
విరిగిన కొమ్మలు
మీదనే పడతాయి
ఎక్కడికైనా దూరంగా పొండి......

సమాధులను తట్టిలేపండి

మనిషి మరచిపోయాడు
పరమాత్మను వెతికే
పరుగు పందెంలో
ముందుకు దూసుకు పోయినవాడు
విజయ రహస్యం చెప్పడు

వెనుకబడి పోయిన జీవి
వెనుదిరిగి చూడడు
మనిషి మరచి పోయాడు
మనిషి మరచి పోయాడు

గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేసి
రాతిలో దేవుని చూడగలమనిషి
మనిషిలో మనిషిని చూడటం
ఎప్పుడో మరచిపోయాడు

మట్టిలో పుట్టి మట్టితో పెరిగి
మట్టిలో కలిసిపోయేలోగా
మరోలోకాన్ని చూడగల మనిషి
కలిసి జీవించే మనిషిలో
మనిషిని చూడటం మరచిపోయాడు
మానవత్వాన్ని మంటకలుపుతున్నాడు.

అనుబంధాలకు విలువలేదు
ఆర్తనాదాలపై అదుపు లేదు
మనస్సు ముచ్చటపడి
మమతల మారాకు తొడుగుతానన్నా
మనిషి కలయబడి
మొదలంటా నరికేస్తున్నాడు.
అష్టసిద్ధులూ అదుపులో వున్నా
ఆపై దానికై ఆరాటపడుతున్నాడు
మనిషినే అనుమానంగా చూస్తున్నాడు

ఎవ్వరికీ అందకూడదని
ఎంతగానో కదించుకు పోతున్నాడు.
ఎవ్వరికీ లొంగకూడదని
వెదురులా వంగి పోతున్నాడు
జీవితం జారుడుబండను
పాతాళం దాకా పొడిగించుకొని
మనిషి పతనమవుతున్నాడు

ఆకాశహర్మ్యాలే
ఔన్నత్యానికి గుర్తయితే
వాటికే చేద్దాం సత్కారాలు
ఊపిరుండటమే
బ్రతుక్కు సంకేతమైతే
సమాధులకు కూడా పోద్దాం ఊపిర్లు
లేవండి
సమాధులను తట్టి లేపండి
మనతో ఎందుకు పోటీ పడవో
చెప్పమనండి......

నూరేళ్ళూ పండుగే

చెట్టు చిగురిస్తే పండుగ
మొగ్గ వికసిస్తే పండుగ
చిగురించిన ప్రతితరువు
క్రొత్త గొంతుకలు పలికిస్తుంది
వికసించిన ప్రతిమొగ్గా
క్రొత్త సౌరభాలు ప్రసరిస్తుంది

మనిషి ప్రభవిస్తే పండుగ
మనసు ప్రసవిస్తే పండుగ
ప్రభవించిన ప్రతి మనిషీ
ప్రగతి మార్గాలు నిర్మించాలి
ప్రసవించిన ప్రతిమనస్సు
క్రొత్త ఆశయాలు కుసుమించాలి

చిగురించే కాలానికే
చెట్టు విరిగి పడుతున్నా
వికసించే వేళకే
మొగ్గ నేలరాలుతున్నా
ఏ గొంతు మూగపోకూడదు
ఏ తావీ తలవాల్చ కూడదు

మనిషి ప్రభవించే సమయానికే
నేలబ్రద్దలయి పోతున్నా
మనసు ప్రసవించే కాలానికే
గుండె ఆగిపోతున్నా
ఏ ప్రగతీ ఆగిపోకూడదు
ఏ ఆశయం ఆవిరైపోకూడదు
చెట్టుగా విరిగిపోయినా
అది మరోశక్తిగా సఫలమవుతుంది
మొగ్గగా రాలిపోయినా
అదెన్నో ఊహలకు ఊపిరిపోస్తుంది

నేల బీటలు వారితే మాత్రం ఏం
నింగి నిన్ను కౌగిలించుకుంటుంది
గుండె ఆగిపోతే మాత్రం ఏం
కోటి భావాలకు కొలువు తీరుస్తుంది

ఊహలకు ఊపిర్లున్నంతకాలం
చైతన్యం చెలరేగుతూనే వుంటుంది
భావాలు బ్రతికున్నంతకాలం
సౌమనస్యం వెల్లివిరుస్తూనే వుంటుంది

తలను కాపాడుకుంటే చాలు
వేళ్ళు అవే స్థిరంగా వుంటాయి
మనస్సును నిండుగా వుంచితే చాలు
బ్రతుకు నూరేళ్ళూ పండుగవుతుంది

హృదయ రసాలం

కురుస్తున్న వెన్నెల ధారలో
ఎక్కడో చిన్న ప్రతిబంధం
కలుస్తున్న దిగంతరాల్లో
ఏదో తెలియని శూన్యం
హృదయాన్ని పాన్పులా పరచినా
తలపులకు నిదురపట్టనిస్థితి
ఊహలన్నింటికీ ఊపిరి పోసినా
ఒక్కటీ బ్రతకలేని పరిస్థితి
అలల అలజడి అంతరించి నట్లున్నా
కడలిలో తెలియని కల్లోలం

కాలానికి దేనితోనూ ముడిలేదు
బంధానికసలు కాలమంటే తెలియదు

చెట్టు ఎత్తుగానే ఎదగాలంటే
వైశాల్యముండదూ - నీడా వుండదూ
వైశాల్యమే ప్రధానమనుకుంటే
నీడున్నా ఫలితముండదు

నీడా నిలవాలీ ఫలాలు కావాలంటే
చెట్టు రసాలంలా సిరులు కురవాలి
ఉన్నతమూ విశాలమూ కావాలనుకుంటే
మనసు అటూ ఇటూ ఎదగగలగాలి

చైతన్యం అనంతం

నీ గూడే నువ్వు కట్టుకుంటావ్
నీ తోడే నువ్వు వెతుక్కుంటావ్
నీ నీడకే నువ్వు భయపడుతుంటావ్
మనిషీ! నువ్వెందుకిలాగే బ్రతకాలంటావ్

ఎగిరే పక్షికి
కదలలేని కుక్షికి
ఒకే న్యాయం కావాలంటావ్
రెక్క మొలచీ మొలవక ముందే
ఎన్ని లోకాలు తిరిగొస్తుందో పక్షి
వినీలగగనానికి
వింతసోయగాలు కల్పిస్తూ
కదలలేని గింజలకు
దిగంతవ్యాప్తి కల్గిస్తూ
రెక్కలమాటున ప్రపంచాన్నే
పొదివి పట్టుకొని
చుక్కల చాటుగా శూన్యాన్నంతా
చుట్ట చుట్టుకొని...

మరి నువ్వు
వయసు మీదపడుతున్నా
మనస్సును మరుగుజ్జుగానే వుంచుతావ్
ప్రపంచం తలక్రిందులవుతున్నా
పంచతంత్రసూత్రాలు కూడా గమనించవ్

ఈలోకమింతే

బడుగు బ్రతుకుల చీకటి తెరల క్రింద
ప్రజాస్వామ్యం వెన్నెలకుప్పలాటలు

కాలం విడిచిన కన్నీటి వాగుల్లో
న్యాయసూత్రాల నౌకా విహారాలు

ఆకు అడ్డుకోతలో అంతర్భాగ పరామర్శ
మనిషిని నిలువునా కోసినా కులవైభవ దిదృక్ష

లోకమంతా కలిసి ఒకే ఉమ్మడికుటుంబం
కుటుంబంలో ఎవరి మట్టుకు వారే ఈ లోకం

శాంతిసాధన లక్ష్యంగా
పరస్పరం సంఘర్షణలు
సమైక్య జీవన సూత్రంలో
విడివిడిగా ముఠా చర్చలు

పునాది

మీరంతా కోకిల లయితే
నేను కాకిని
మీ బిడ్డలను పెంచేది నేనే

మీరంతా రత్నాలయితే
నేను రాయిని
మీ శక్తికి ఒరిపిడిని నేనే

మీరంతా నిప్పులయితే
నేను మసిబొగ్గును
మీ తేజస్సు కాలంబనం నేనే

మీరంతా వెలుగులయితే
నేను చీకటిని
మీ కాంతికి ఉద్దీపనం నేనే

మీరంతా పైకెదుగుతుంటే
నేను క్రిందనే స్థిరంగా వుంటా
మీ ఔన్నత్యానికి పునాది నేనే.

మరో ప్రపంచం

నీవు గ్రుడ్డివి
నేను పుట్టుగ్రుడ్డిని
అయినా సరే నాతో రా
మానవతా శిఖరాలకు
దారి చూపిస్తా

కాళ్లకు వేడినెత్తురు
తగిలిన ప్రతిచోటా
నీ మార్గంలో మలుపు
బ్రద్దలైన గుండెల చప్పుళ్ళు
వినిపించిన ప్రతిమాటూ
నీ దారిలో మైలురాయి
పావురాళ్ళు అల్లార్చిన
రెక్కల చప్పుళ్ళు, గావుకేక
ఎక్కడ వినిపిస్తే అక్కడ
మానవత పునర్జన్మ ఎత్తుతున్నట్లు
అక్కడ నుండి
అనంతం వైపు పయనించు
నిట్టూర్పుల వేడితో
కల్తీపడని గాలి
నినాదాల వాడితో
కల్తీపడని జాలి
నీగుండెలు తాకినచోట

ఆగు కన్ను దెరు
రెండు కళ్ళలో
రెండు జ్యోతులు వెలుగుతాయి
అక్కడ చీకటైనా చిదిమి
దీపాలు పెట్టుకుంటారు.
పగలైనా మరచి
పసిపిల్లల్లా కలిసిపోతారు

మాయావాదం

తమ్ముడూ!
నిన్ను నేనే మన్నానని
నన్ను దిగమింగేలా చూస్తావ్
మనుషులం మనుషుల్లా బ్రతుకుదాం

ఆ మాటలకే అంతకోపమా?
మమతలు బంధాలని
మాయావాదులు చెప్పింది నిజమే
మమకారాన్ని వదలిపెట్టమని
మరీ మరీ ప్రబోధించిందీ సత్యమే.

అంత మాత్రాన
కర్తవ్యాన్ని గమనించక
కాలదన్నినా చలింపక
అవినీతి సముద్రంలో
అలా మునిగిపోవడమేనా?
ఎవ్వరినీ లెక్కచేయకుండా
ఎగిసి పడటమేనా?

నిన్ను మనిషిగా పుట్టించి
దేవుడు చేసిన నేరానికి

నీకు అధికారాన్ని కల్పించి
మరెవరో చేసిన పాపానికి
అమాయక జీవులంతా
అంతం కావలసిందేనా

ఇరుకు గదిలో భోంచేస్తున్నా
విశ్వమంతా కబళించాలని ఆశ
పిడికిలి చిన్నదైనా
ప్రపంచమంతా చేజిక్కాలని తపన
కాళ్ళు కాటివైపు చూస్తున్నా
వ్రేళ్ళ అంచున ఏదో తహతహ

చితి మీదకు నువ్వెక్కినప్పుడు
సిరి కాదు కదా కనీసం నీ
ఊపిరి కూడా నీ తోడు వుండదే
మంట పెట్టీ పెట్టగానే నీ
కన్న బిడ్డయినా నీ వంకచూడడే
ఆలు సరే అంత దూరం కూడా రాదు

పనిని పలుకరించు
పవిత్రంగా భావించు
మరో జన్మకైనా మనస్సు పరిమళిస్తుంది
మనిషిని గ్రహించు
మనిషిగానే పరిగ్రహించు
మరోయుగానికైనా మానవత్వం వెల్లి విరిస్తుంది

రేపటి వసంతం కోసం

కాలంతో పోటీపడి విఫలమై
కన్నీరు కారుస్తూ కూర్చుంటే
కాలానికెందుకుంటుంది కరుణ
కన్నీరు తుడిచి ఓదార్చటానికి

చరిత్రపుటలను త్రవ్వి చూడు
అదెంత పాషాణ ప్రాయమో తెలుస్తుంది
పోటిలో విఫలమవుతున్నా
కాలానికే సవాలుగా మారి
మళ్ళీ మళ్ళీ ప్రయత్నించి
మహోన్నత శిఖరాల కెక్కిన
కథలన్నీ కలిపి చదువు
కాలమెంత పిరికిదో అర్థమవుతుంది

పిడికిలి బిగించితే కదనం
కనుకొలకులు చలిస్తే మథనం

అయిదు వ్రేళ్ళూ ఒక్కటై
ఆసరా ఇస్తున్నంత కాలం
పిడికిలినెందుకు సడలించాలి
అన్ని దారులూ ఒక్కటై
నడిపిస్తున్నంత కాలం
గమ్యాన్నెందుకు విస్మరించాలి

వంచననైనా
మంచితనంతో జయించు
కంచెలనైనా
గుండెబలంతో గమించు

రేపటి వసంతంలో
మధుర ఫలాలన్నీ నీవే
కాటికి నిన్ను కదిలిస్తున్నా
చెమర్చని కళ్ళంటూ ఉండవే!

నడవడి పదునెక్కాలి

ఎడారుల్లో ఎంతదూరం సాగినా
కంటికి చుక్కనీరు కనిపించదు
ఎండమావులు చూచి ఎగిసి పడ్డావంటే
కాళ్ళు కూరుకొని కూలిపోక తప్పదు
ఎదగని గుండెల్లో ఎంత లోతు త్రవ్వినా
ఆర్ద్రత ఏ పొరలోనూ ఆవిర్భవించదు
మనస్సును మనస్సుకు ఊతమిచ్చినా
ఏతా మెత్తాలంటే ఏమీ అగుపించదు
మబ్బు కప్పిన మనోగగనతలంలో
మమతల చంద్రుడు మచ్చుకైనా కనిపించడు
కాటుక కలతపెట్టే కనుపాపల్లో
కల్మషం లేని భాష్పం కలికానికీ దొరకదు

ప్రయాణం ప్రారంభించే ముందే
పచ్చిక మొలకలు పరిశీలించుకోవాలి
దాహం వేసినప్పుడే కాదు
ముందే- గుండె నద్దాలనుకొన్నప్పుడే
కళ్ళలో ఆర్ద్రతావలయాలు పసి గట్టాలి
మమతల పందిళ్ళు అల్లుకొనే ముందే
తీగె సాగుతుందో లేదో గుర్తించాలి

చంద్రుడు ఎప్పుడూ అక్కడే వుంటాడు
కానీ కనిపించే కాలంలోనే కళ్ళెత్తాలి
బ్రతుకుబాటలో గమ్యాన్ని చేరాలంటే
నడకే కాదు నడవడీ పదునెక్కి వుండాలి.

పచ్చనోటు

కాలాన్నీ దూరాన్నీ కూడా
రూకలతో కొలిచే కాలమిది
మనస్సులనూ మమతలనూ సైతం
కరెన్సీ మడతల్లో వెదికే రోజులివి

పిపీలకాలుకూడా
బియ్యంగింజలు వదిలి
పదిపైసల బిళ్ళలు మోస్తున్నాయి
పిల్లచేపలు సైతం
చిల్లరనాణాలనే
చిత్రంగా అందుకొంటున్నాయి

పంచదార చిలకలకూ
పచ్చకాగితాలకూ తేడా
పసిపిల్లలకూ తెలుస్తోంది
అన్నప్రాశనరోజే
ఆవకాయపై చూపుమాని
డాలర్లవైపు దూకుతున్నారు

ఏ వాహనమైన చూడు
కదలాలంటే
రూపాయి బిళ్ళలే చక్రాలు
మనిషయినా పశువైనా
పక్షి అయినా పరమాణువైనా
నడకమాత్రం నాణాలమీదే

స్పృహ తప్పిన జీవిని
కరెన్సీతో విసిరి చూడు
పది సెకన్లలో పైకి లేస్తాడు

ప్రాణం విడిచినవానికి
పచ్చనోట్లతో పాడెకట్టిచూడు
తృప్తిగా నవ్విన నవ్వు
పెదమలపై పరిమళిస్తుంది

కాలం ఏదయితేనేం

కదం త్రొక్కుతూ బ్రతుకుబాటలో
జవనాశ్వంలా సాగాలన్నా
ఎగిసి దూకుతూ కొండ కోనలను
సెలయేటి ధారలా కడగాలన్నా
కాలం ఏదయితేనేం
కన్నులొత్తుకొని నిలబడతారేం

ఆగకుండా ఎదకదలికలన్నీ
అలలై కలలై సాగాలన్నా
గుండె బరువుగా నిలిచిన గతం
అణువై ఆవిరై కరగాలన్నా
కాలం ఏదయితేనేం
రక్తబాష్పాలు చిందిస్తుంటారేం

నిన్న బీడుబారిన నేలలో
నేడు పచ్చిక బయళ్ళు పరవశిస్తుంటే
నిన్న ఎండిపోయిన ఏరు
నేడు చెలమగా చెలరేగుతుంటే
కాలం ఏదయితేనేం
వెర్రిమూలుగులు వినిపిస్తారేం

నసీబు నిన్ను గరీబును చేసినా
మనస్సు నవాబులా శాసించాలి
నొసటివ్రాలు కన్నీటి జాలయినా
సొంతగొంతుకతో రాగం మార్చాలి
కాలం ఏదయితేనేం
కుత్తుక కత్తుల నత్తుకుంటారేం

గుండె పిడికెడు పొట్టపిడికెడు
వ్రేళ్ళు బిగిస్తే బ్రతుకు పిడికెడు
మనిషి తెగిస్తే లోకం పిడికెడు
తెగించమంటే
రెండు చేతులూ బిగించమంటే
ముసలినాగులా బుసకొడతారేం
కాలం ఏదయితేనేం
కవాతు చేయమన్నా
కదలకుండా నిలబడతారేం

కాలం కొండచిలువలా కబళిస్తే
పొట్ట చీల్చుకొని బయటికి రండి
సమాజం కోడెత్రాచులా పగబడితే
గొంతుపట్టి లాగండి బయటికి
కాలం ఏదయితేనేం
ఉప్పెనలై ఉరికురికి దూకరేం!

నీకు నువ్వే దిక్సూచి

ఎవరో వస్తారని
ఋతువులు విదిల్చిన బహుమతులన్నీ
నీ కోసం మూటకట్టి తెస్తారని
వసంతం నుండి శిశిరం దాకా
నువ్వు నిరీక్షిస్తూ వుంటే...

చూరునీటి కాలువల్లో
కాగితాల పడవలు వదలి
కేరింతలు కొట్టే పిల్లల్లా
పిచ్చిగా తలబోసుకుంటుంటే...

నీకు నువ్వే దిక్సూచివై
నిన్ను నువ్వే నడిపించుకోవాలనీ
నీకు నువ్వే నిట్రాతివై
నీ బ్రతుకు గుడిసె నిలుపుకోవాలనీ
అర్థమై ఆగిచూచుకుంటే
అంత జీవితమూ అంతమై వుంటుంది
మిగిలిన ఆకొంచాన్నే
మీదుకట్టి నడవమంటుంది

అప్పటికైనా కళ్ళు తెరిచి
ఆశల పల్లకీలను దించి
ఆశయాల చిదుగులు ప్రోగు చేసుకుంటే
చితిమీద అవికాలిపోయినా
చిరంజీవిగా నిన్ను మిగులుస్తాయి
మనిషిగా నువ్వు లేకపోయినా
మానవత్వానికి మరో జన్మనిస్తాయి.

నీడ చాటు వెలుగు

అలలు బ్రద్ధలై
అదేపనిగా మరలుతుంటే
తీరానికి చేరువలోనే
నిలుచున్నావని నేనంటా

కళ్ళు ఉప్పెనలై
కనుపాపలను కప్పేస్తుంటే
స్పందన మనస్సుతో
సహగమిస్తోందని నేనంటా

పిడికిలి బిగించి
గుండె కోపంతో రగులుతుంటే
పెరిగే ప్రేమను పంచుకొమ్మని
చేయిచాస్తోందనే నేనంటా

ఎడారిలా బ్రతుకు
ఎండి బీటలు వారుతుంటే
తలపుల తొలకరికి
తలుపులు తెరుస్తోందనే నేనంటా

క్రీనీడలు చుట్టుముట్టి
కలచి వేస్తున్నాయని నువ్వంటే
దగరలోనే దీపముంటుంది
వెతుక్కోమనే నేనంటా.

క్లైబ్యం మాస్మ గమః

ఎక్కిన కొమ్మను
ఎవరు నరుక్కున్నా
పట్టు పోగొట్టుకొనేది మనిషే
చెట్టు కోల్పోయేది కొమ్మే
పట్టు తప్పిన మనిషి
పతనాన్ని తప్పించుకోలేడు
కొమ్మ విరిగిన చెట్టు
మళ్ళీ రెమ్మవేయకూరుకోదు

చిక్కిన అవకాశాలను
చిద్రుపలు చేసుకొంటే
అక్కడే ఆగిపోయేది మనిషే
అందకుండా సాగేది కాలం
ఆగిపోయిన మనిషి
సగం చెక్కిన శిల్పమయితే
సాగిపోయిన కాలం
మరో శిలను తట్టి లేపుతుంది

కలతలే కర్తవ్యాన్ని శాసిస్తే
ఇప్పటికీ నాలుగుకాళ్ళతో నడిచేవాడు మనిషి
అహంకారమే అవకాశాలను నియంత్రిస్తే
ఇప్పటికీ గ్రుడ్డిదీపంగా నిలిచేవాడు మనిషి

కలతలను కన్నీళ్ళతో ఓదారుస్తూ
కాలాన్ని వెళ్ళబుచ్చుకోవద్దు
పిడికిళ్ళకు మరణశాసనాలు వ్రాస్తూ
మరో విప్లవమని అనుకోవద్దు.

కర్మసూక్ష్మం

కాలం కలిసిరానపుడు
కాళ్ళు తడబడినప్పుడు
అడుగు జారటం సహజం
అక్కడే కూర్చుంటాననటం అవివేకం

గాలం విసిరినప్పుడు
ఏరు అనుకూలంగా పారనప్పుడు
చేపపడకపోవటం సహజం
గాలం పైకి లాగననటం అవివేకం

గింజను నేలలో విత్తినప్పుడు
చుక్క నీరూ అందనప్పుడు
మొలకెత్తక పోవటం సహజం
మళ్ళీ గింజ నాటననటం అవివేకం

అడుగుజారినా సరే
నడకమాననివాడే మనిషి
చేప పడకపోయినా
గాలాన్ని విడవనివాడే మనిషి
గింజ మొలవకపోయినా
మళ్ళీ విత్తితేనే మనిషి

నైరాశ్యం నీ కాళ్ళు నరికినా
విశ్వమానవగతి
విధిగా ముందుకే సాగాలి
పిరికితనం నీ గాలాన్ని విరిచినా
ప్రపంచంలో ఆకలి
పత్తా లేకుండా పోవాలి
అవిశ్వాసం నీ గింజలు నీటగలిపినా
చెట్టు నీడలోనే బ్రహ్మాండం
సేదదీరగలగాలి.....